కర్మ్యకథ

# చాతుర్వర్ణ్యం మయాసృష్టం

—'సంఘమిత్ర'.

మూాడురోజులపాటు యథేచ్ఛగా కొనసాగిన విధ్వంసకాండను రేడియోలో వింటున్నప్పుడు, దినపత్రికలో చదువుతున్నపుడూ— "ఎందుకిలా జరుగుతోంది"—అని భారతి అనుకొంటూనే వుంది.

నాలుగోరోజు అదుపులోకి వచ్చిన పరిస్థితుల దృష్ట్యా నిషేధాజ్ఞల్ని ఓ రెండు గంటలపాటు సడలించారు. రాజ శేఖరం చేతిసంచి పుచ్చుకొని కూరగాయలకు వెళ్ళి, ఓ అరగంటలో తిరిగి వచ్చాడు. భర్త చేతిలోని సంచిని అందుకొంటూ భారతి అడిగింది—



"ఎలావుంది బయటి వాతావరణం?"

"కొంచెం ఫరవాలేదు."—రాజశేఖరం చెప్పాడు. "రేపు కమిటీ వస్తోందట!"

"ఎందుకు?"— భారతి భర్త ముఖంలోకి సూటిగా చూసింది.

"ఇక్కడ పర్యటించి, జరిగిన నష్టాన్ని అంచనా వేస్తారుట"—రాజశేఖరం పొడిపొడిగా చెప్పాడు.

భారతి భర్త మాటలు వింటూ, భావరహితంగా నవ్వింది. తర్వాత కూరగాయల్ని తరిగేందుకు కూర్చుంది.

"కూరగాయలు బాగా వాడిపోయాయి"— భారతి కత్తిపీట నందుకొంటూ అంది.

"ఆ మాత్రం దొరకడమే దుర్లభమైపోయింది" —రాజశేఖరం పీటవాల్చు కొని భారతి ఎదురుగా కూర్చున్నాడు.

ఇంతలో—వరండాలో తమ్ముడ్ని ఆడిస్తోన్న పద్మ ఏడుస్తూ తండ్రి దగ్గరికి వచ్చింది. రాజశేఖరం కూతుర్ని దగ్గరకు తీసుకొంటూ, అనునయిస్తూ అడిగాడు— "ఏమైందమ్మా?-ఏం?"—

"తమ్ముడు కొట్టాడు నాన్నా"— పద్మ ఏడుస్తూ చెప్పింది.

"ఎందుకు కొట్టాడు?"—భారతి కూతుర్ని అడిగింది.

"బొమ్మకావాలని తీసుకున్నాడు, వద్దంటే కొట్టాడు"—వెక్కుతూ చెప్పింది పద్మ.

అక్క తనమీద ఫిర్యాదు చేస్తోందని గ్రహించిన ఐదేండ్ల రఘు వరండాలో గుమ్మం చాటునుండి తొంగి, తొంగి చూస్తున్నాడు.

"పోనీలేమ్మా, ఆ బొమ్మ వాడికే యిచ్చేయ్, జీతం అందుకున్నాక నీకు మరో బొమ్మ కొని పెడతాన్లే"—రాజశేఖరం కూతుర్ని సముదాయించాడు.

"అన్నట్లు మీ జీతాలు షాపు తెరిచాక యిచ్చేస్తారంటారా?"—భారతి వున్నట్టుండి అడిగింది.

"ఇవ్వకేం? పట్నంలో యింకా నిక్షేపంలా మిగిలిపోయున్న ఆరడజను షాపులలో మా షాపొకటి. కొంచెం ఈ గొడవలు సర్దుకొంటే రెండు మూడు రోజులలో షాపు తెరుస్తారని కూరగాయల షాపు వద్ద కనిపించిన గుమస్తాచెప్పాడు."—రాజశేఖరం నవ్వాడు.

ఆ నవ్వు చిత్రంగా, భారంగా వినిపించింది భారతికి. ఆమె ఒక్కమారు తలెత్తి భర్తను చూసింది.

నిజానికి రాజశేఖరం చాలా మంది దురదృష్టవంతులకన్నా అదృష్టవంతుడే. ఉద్యోగం వచ్చేవరకూ "ఏదో ఒకటి చేద్దాంలే"—అనుకొంటూ పాత రోజుల నాటి పి.యు.సి. పూర్తయ్యాక ఓ పెద్ద పేరున్న క్లాత్ ఎంపోరియంలో సేల్సుమెన్‌గా చేరాడు. అలా చేస్తూనే ఒకటిన్నర దశాబ్దాలపాటు ఉద్యోగం కోసం నిరీక్షణలో గడిపాడు. తర్వాత కొన్నాళ్ళకు రాజశేఖరానికి అర్థమైంది, తనకిక గవర్నమెంటు ఉద్యోగం రాదని. అయినా రాజశేఖరం అధైర్యపడ లేదు. అతడికి అన్ని విధాలా షాపు యజమాని భరోసా యిచ్చాడు. పెండ్లయ్యాకా, పిల్లలు కలిగాకా, తడవలు తడవలుగా జీతం పెంచాడు. జీతంతోపాటు అమ్మకం మీద కమీషనూ పెరిగింది. రాజశేఖరం యీ 'ఉద్యోగం తనకు చెందినదీ'— అనే భావంతో పని చేస్తాడు. అలాపని చేయడం వలన షాపు యజమాని అభిమానానికి పాత్రుడయ్యాడు. కష్టించి పని చేసే రాజశేఖరం అంటేషాపు యజమానికి చాలా సదభిప్రాయం, నమ్మకం.

*　　*　　*

రాజశేఖరం భారతితో చెప్పినట్టుగానే ఒకటి కాదు రెండు కమిటీలొచ్చాయి. ఒకటి చిన్నదీ, మరొకటి పెద్దదీ! వస్తూనే చిన్నకమిటీ సభ్యుల్నూ, పెద్ద కమిటీ సభ్యులూ ఎవరి అప్పుల్ని వారు పరామర్శించుకున్నారు. తర్వాత పర్యటన ప్రారంభించారు.

ఆ తర్వాత రెండు కమిటీలు సాయంత్రం ఒకే సమయానికి వేర్వేరు ప్రాంతాల్లో సభలు దీర్చాయి. ఆ, యీ సభల్లో సీనియర్ నాయకులు జూనియర్లను కసురుకున్నారు, గదమాయించారు. 'చూసి రమ్మంటే కాల్చి వచ్చేరకమంటూ'—కోపగించారు. గానీ జూనియర్లు యిలా సీనియర్లు తమపై చూపిస్తున్న అకారణ కోపానికి విభ్రాంతి చెందలేదు. వారికి తెలుసు, సీనియర్లదంతా వుత్తుత్తి కోపమేనని, ఆ మాత్రం తెలియకుంటే వారు రేపటి నేత లెలా కాగలరు?

తర్వాత నివేదికలు తయారుచేసేముందు సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. సిద్ధాంత పరంగా, రాజకీయ పరంగా, అధికార పరంగా——ఇంకా ఎన్నెన్నో విభేదాల కారణంగా—ఏనాడూ, ఏ విషయంలోనూ అభిప్రాయాలు కలియని సదరు రెండు కమిటీలూ— "ఈ చెలరేగిన విధ్వంసకాండకు కారకులు, బాధ్యులు కేవలం సంఘ విద్రోహ కరశక్తులే"— అంటూ ముక్తకంఠంతో ఏకాభిప్రాయాన్ని ప్రకటించాయి. గాలిజల్లడానికీ, వేపపువ్వు పోయడానికీ, ముత్యాలు చేవడానికి కేవలం తమకు తాము గ్రామ దేవతగా ప్రతిష్ఠించుకొన్న 'అమ్మతల్లి' శక్తులే కారణమని బలంగా నమ్మే జనం సదరు కమిటీలు వెలిబుచ్చిన ఏకాభిప్రాయాన్నికూడా నమ్మారు.

రాజశేఖరానికి తరువాత తెలిసింది. తమ విన్నట్లు ఒకటి కాక రెండు కమిటీలు వచ్చి వెళ్ళాయనీ, అతను పని చేస్తున్న షాపు యజమాని నిక్షేపంలా వున్న షాపు మీద ఏదో కొంత నష్ట పరిహారం రాబట్టుకోవడం కోసం అప్పుడైన ఓ కమిటీ సభ్యుని ద్వారా విఫల ప్రయత్నం చేసాడనిన్నీ.

*　　*　　*　　*

భీభత్సం సద్దుమణిగిన తరువాత పేలవంగా అలముకొన్న ప్రశాంతతతోమరో నాలుగు రోజులు భారంగా, అసౌకర్యంగా గడిచాయి. మర్నాడు దుకాణాలు తెరిచారని గుమస్తా కబురు చెప్తే, రాజశేఖరం

హడావిడిగా బయులుదేరి వెళ్ళాడు. అలవాటు ప్రకారం మధ్యాహ్నం భోజనానికి భర్త ఇంటికి వచ్చేస్తాడని అనుకొన్న భారతి త్వరగా వంట పని ముగించి, రాజశేఖరం కోసం నిరీక్షిస్తోంది. పిల్లలిద్దరూ వరండాలో ఆడుకొంటున్నారు.

దూరంగా సైరన్ మ్రోగిన చప్పుడు! ఒంటి గంటైంది. రాజశేఖరం వచ్చే వాడైతే ఆ వేళకు ఇంటికి చేరేవాడు. బహుశా భర్త ఇక ఆ పూటకి భోజనానికి రాడేమో! భారతికి కొంచెం అనుమానం వేసింది. ఆమె వరండాలోకి వచ్చింది.

"అమ్మా ఆకలేస్తోంది, అన్నం పెట్టవే" రఘు తల్లిని చూస్తూనే చుట్టుకున్నాడు.

"అప్పుడే వద్దురా. మరికాసేపు ఆడుకొని, నాన్న వచ్చాకా భోం చేద్దాం" పద్మ తమ్ముడికి చెప్పింది.

రఘు తల అడ్డంగా తిప్పాడు. అదే పనిగా ఆడిన ఆటే మళ్ళీ మళ్ళీ ఆడుతూండడం వాడికి నచ్చలేదు.

"కాసేపు ఆడుకో నాన్నా. నాన్న గారొచ్చాకా అన్నం పెడతాను" భారతి కొడుకును బుజ్జగిస్తూ చెప్పింది.

రఘు అయిష్టంగా తల ఆడిస్తూ చెప్పాడు. "అయితే అక్కొద్దు, నేనొక్కడ్నీ ఆడుకుంటాను" వాడికి గత వారం రోజులుగా ఇంట్లో ఎవరి ప్రవర్తనా నచ్చడం లేదు. ముఖ్యంగా వీధిలో తిరుగుతూన్న పోలీసు వాళ్ళను చూద్దామని గేటు వరకూ వెళ్తే చాలు, అక్క కేకలు వేయడం, అమ్మ అదుపులో పెట్టడం మరీ నచ్చడం లేదు.

"పోనీ నీవొక్కడివే ఆడుకోరా" పద్మ తల్లి వెనక్కి చేరింది.

భారతి గమనిస్తోంది. రఘు క్షణాల్లో వరండాలో పేర్చి వున్న ఆట వస్తువుల్ని చేరి, వాటిని చిందర వందర చేశాడు. నాలుగు రోజుల క్రితం అక్క దగ్గర నుండి బలవంతంగా లాక్కొని, స్వంతం చేసుకొన్న బొమ్మను తీసుకొని, దాని తలను వెనక్కి తిప్పి, చేతుల్ని వెనక్కి విరిచాడు.

పద్మ ఒక్క గెంతులో అక్కడకు చేరుకుని "దాన్ని పాడు చెయ్యకురా" అని కేకలు పెడ్తూ, వాడి చేతుల్లోంచి బొమ్మను తీసుకునేందుకు ప్రయత్నించింది.

అంతే! వాడు రెచ్చిపోయాడు. "ఇది నా బొమ్మ. నీకు నాన్న మరొకటి కొంటానన్నారుగా" అంటూ దాని కాళ్ళు, చేతులు పీకేశాడు.

భారతి కళ్ళప్పగించి ఆ దృశ్యాన్ని చూస్తోంది. ఆమెకు రేడియో వింటున్నప్పుడు, దిన పత్రికలు చదువుతున్నప్పుడు "ఎందుకిలా జరుగుతోంది?"- అని మనసులో సన్నగా కదిలే ప్రశ్నకు లీలగా సమాధానం దొరికినట్లనిపించింది. "విధ్వంసం మనిషికి సహజాతంగా అబ్బిన గుణం. అయితే మనిషిలో ఏదో మూల అణిగి వున్న ఆ భయంకరగుణాన్ని ప్రేరేపించి, వెలికి తీసి సమాజం మీద ప్రయోగించ బూనితే?... జరిగేదేమిటి?..."

*　　*　　*　　*

రాజ శేఖరం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి బయల్దేరుతున్నప్పుడు, షాపు యజమాని పిలిచి చెప్పాడు.

"శేఖరం గారూ, మీరు చూస్తున్న కష్టమర్లు, వారి పద్దులు సాయంత్రం లోగా లిస్టు వ్రాసి సిద్ధంగా వుంచండి"-

రాజశేఖరం యజమాని వైపు చూశాడు. తర్వాత సరేనంటూ తలాడించాడు.

"రశీదు పుస్తకాలున్నాయి కదూ, ఎవరెవరు మనకెంతెంత చెల్లించారు, ఇంకా బకాయిలెంత వున్నాయి, వివరంగా కావాలి" - యజమాని నవ్వుతూ చెప్పాడు.

రాజశేఖరం ఒక్క క్షణం ఆలోచించాడు. 'సాయంత్రం లోపు వివరాలు తయారు చెయ్యాలంటే తను ఆ పూట భోజనం మానేయడమే ఉత్తమం. పాపం! యజమాని వ్యాపార విషయాలన్నీ బేరీజు వేసుకోడానికి ఎంత ఆతృతగా వున్నాడో? స్వయంగా పిలిచి మరీ చెప్పాడు. ఈ పరిస్థితిలో ఇలా బేరీజు వేసుకోవడం చాలా మంచిది కూడా' అనుకున్నాడు రాజశేఖరం. మరు క్షణంయజమాని చెప్పిన పని చేయడానికి ఉపక్రమించాడు. సాయంత్రం సరికి వివరాలు సిద్ధమయ్యాయి. మరోమారు పరిశీలించి, తయారు చేసిన పట్టికల్ని పంజగా పేర్చి రాజశేఖరం యజమాని కందించాడు. యజమాని కాగితాల్ని ఓమారు చూసి, తర్వాత రాజశేఖరానికి ఓ కవరు అందించాడు.

"మీ జీతంతో పాటు, ఓ నెల జీతం అదనంగా ఈ కవర్లో వుంది. రేపట్నుంచీ మీరు పనికి రానవసరం లేదు" - యజమాని మెల్లగా చెప్పాడు.

రాజశేఖరం నిశ్చేష్టుడయ్యాడు.

"మరో విధంగా భావించకండి. పని విషయంలో మీరంటే మాకెంతో గౌరవం. గానీ... గానీ... మీరు మా కులం వారు కారు. ఇంత గొడవ జరిగి పట్నానికి పట్నం నాల్రోజుల్లో ధ్వంసం అయ్యాక, యింకా మిమ్మల్ని షాపులో వుంచుకుంటే మా కులం వాళ్ళు నొప్పుకోరు"-

రాజశేఖరానికి అతడు చెప్తున్నదేమిటో అప్పుడర్థమైంది. అదే కాదు! మరొకటి కూడా అర్థమైంది. ఒకటిన్నర దశాబ్దాలకు పైగా వేరే కులం వాడి షాపులో పని చేసినందుకు స్వకులస్థులు కూడా తనని దరి చేర్చుకోరని!- అతడు యజమాని యిచ్చిన కవరు అందుకొని, మెట్లు దిగి రోడ్డు పట్టాడు. పక్కనే వున్న ఓ గుట్ట మీద వెలసిన దేవాలయంలో నుండి స్పీకర్లో మంద్రస్వరాన 'గీత' వినిపిస్తోంది!-

"చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః!
తస్య కర్తారమః మాం విద్ధ్య కర్తార మవ్యయమ్!!!"

## కర్ఫ్యూ రాత్రి

రాత్రి
'కర్ఫ్యూ కాలసర్పం' నగరాన్ని కౌగలించుకొంటుంది
నడి వీధికి మనుష్యులొస్తే చాలు
కాటెయ్యాలని చూస్తుంది
కప్పల్ని మింగినట్లు మింగెయ్యాలని చూస్తుంది
ఆ రాత్రి
ప్రాణాలు గుప్పెట్లో
బిక్కు బిక్కు మంటూ భయంతో
వణుకుతూ వుంటాయి!
నాటి రాత్రి
గుండెలపై చెయ్యివేసుకొని చెప్పలేం
బైటకు వెళ్ళిన వ్యక్తి
క్షేమంగా ప్రాణాల్తో తిరిగి వస్తాడన్నది
ఆనాటి రాత్రి
ప్రాణమొక గడ్డిపోచ
జీవాల నజీవ ఊచకోత
అటువంటి రాత్రులు
నగరం లోలోపల ఎంత కుమిలిపోయిందో!
ఎంతగా హింసలకు బలైపోయిందో!!
తిరిగి పొందలేని కళాకాంతుల్ని ఎలా జారవిడ్చుకుందో!!!
వైభవ వస్త్రాల్ని వీడి ఎలా దిగంబరత్వంతో దుఃఖించిందో?!

— శతభిష్

## మాటలు

ఇవాళ మాటలు లేవు
సముద్రపు ఒడ్డున
కాళ్ళకింద ఇసక జారినట్లు
మాటలు జారిపోతున్నాయి
ఇవాళ మాటలెక్కడా వినబడటంలేదు
నీటి బుడగల్లా నిశ్శబ్దంగా పగిలిపోతున్నాయి

మాటలు లేవుగానీ
నోళ్ళు తెరుచుకుంటూనే వున్నాయి
నింద నిష్ఠురం తిరస్కారం శాపం
ధ్వని తరంగాలై రొద చేస్తున్నాయి
బాధ, ప్రేమ, స్నేహం ఆవేశం ఆవేదన
అన్నీ పలికించే మాటలు
ఆవిరైపోతున్నాయి
బాధలు పంచుకోవటం
బలహీన పడటమవుతోంది
తీగ ఎక్కడ అల్లుకుంటుందోనని
చెట్టు మాయమవుతోంది
చెట్టు ఎక్కడ పాదుకుంటుందోనని
తీగ పక్కకు తప్పుకుంటోంది
మాటలు లేని మనిషి
మోడు మాకులా
నిశ్చలంగా, ఒంటరిగా
అదే బలమనే భ్రమలో -

— ఓల్గా